# ఉత్తర మీమాంస

"వివాహానికి, వ్యభిచారానికి తేడా ఏమిటి?" ఈ ప్రశ్న వినగానే - శ్రీకాంత్ ఉలిక్కిపడ్డాడు.

"అదేం ప్రశ్న?" అని అడిగాడు.

"అదే ప్రశ్న. చాలా కాలం నుంచి సమాధానం దొరకని ప్రశ్న" అని ఆ చిన్నది సమాధానం చెప్పగానే ఆ పిల్ల వంక ఒక్కక్షణం కన్నార్పకుండా చూశాడు.

సుందరి పేరుకు తగ్గ రూపం. మూర్తీభవించిన అమాయకత్వం. అందమైన కళ్లలో ఏదో అంతర్మథనం.

ఆ పిల్ల చేతిని తన చేతిలోకి తీసుకుని మెల్లిగా అడిగాడు "ఆర్ యు ఆల్‌రైట్?"

"నో!" అని సమాధానం వచ్చింది. మొదటి ప్రశ్న అర్థం కాక తికమకపడుతూ ఉండే పిడుగులాంటి ఇంకొక గడ్డ ప్రశ్న వచ్చింది.

"శీలం, పాతివ్రత్యం అంటే అర్థం ఏమిటి?"

శ్రీకాంత్ పెద్ద పెట్టున నవ్వి - రెండు చేతులు పైకెత్తి తల మీద పెట్టుకుని నేను 'ఓడిపోయాను' అని అన్నాడు.

"నవ్వులాట కాదు. నేను సీరియస్‌గానే అడుగుతున్నాను."

"చూడు సుందరీ! నేను ఇంజనీర్‌ని. ఎస్.ఎస్.ఎల్.సి. తరువాత తెలుగు భాషతో సంబంధం లేని వాడిని. గత నాలుగు సంవత్సరాలుగా మన దేశం కాని దేశంలో, మన సంప్రదాయం కాని చోట బతుకుతున్నాను. సంస్కృతంలో రీసెర్చి చేస్తున్న నీతో - పోటీ పడలేను - పడను!"

"నిజంగా నీకు తెలియదా!"

"నాకు తెలిసిందల్లా ఒక్కటే."

"ఏమిటది?"

"దట్ ఐ లవ్ యు."

ఆ పిల్ల చిరునవ్వుతో "థ్యాంక్యూ!" అని అంది కాని, ఆలోచన ఎక్కడో ఉంది...

"వేదాలు-ఋషులు నిజంగా మన దేశంలో జన్మించారా? లేదా మనం అలా ప్రచారం చేసుకున్నామా?" అని అడిగింది.

అతను లేచి నిలబడ్డాడు.

"ఎక్కడికి?"

"ఐస్ క్రీమ్."

"ఇంత చలిలోనా?"

"పోనీ వేడి వేడి పావ్‌భాజీ తీసుకురానా?"

ఆ పిల్ల మళ్లీ ఆలోచనలో పడింది.

ఆ కుర్రవాడు చేతులు జోడించి - "ప్లీజ్! బతిమాలుకుంటున్నాను. మళ్ళీ వేద కాలంలోకి వెళ్లవద్దు. ఇరవయ్యవ శతాబ్దంలో నిలబడి ఈ చిన్న ప్రశ్నకు సమాధానం చెప్పు. నాకు చాలా ఆకలిగా ఉంది..."

"అంతేనా?" ... అంటూ ఏదో చెప్పబోయింది.

"అంతే కాదు. నీకు...."

అతని వంక ఒక్క క్షణం చూసింది. పద హోటలుకు వెళ్లి టిఫిన్ తిందాం!'

"ఓ.కే."

హోటల్లో కూర్చున్న తరువాత- టిఫిన్ వచ్చే లోపల సుందరి "భారతీయులం, మనం చెప్పుకుంటున్నంత గొప్పవాళ్లం కాదు" అని అంది.

"అలాగా చాలా కొత్త విషయం చెబుతున్నావు. నీ రీసెర్చికి డాక్టరేట్ ఒకటే కాదు - జ్ఞానపీఠ్ అవార్డు - పులిడ్జర్ ప్రైజు కనీసం నోబుల్ ప్రైజు ఇవ్వాలి... టిఫిన్ చల్లారి పోతోంది తిను!" అని అన్నాడు.

"నేను నిజం చెబుతున్నాను - మన దేశాన్ని చూస్తుంటే చాలా నిరాశ కలుగుతోంది."

"ఎందుకని?"

"మనం చాలా ఆత్మవంచన చేసుకుంటూ బతుకుతున్నాం. మనం కావాలని తప్పులు చేస్తూ వాటికి ఏవో సంజాయిషీలు చెప్పుకుంటున్నాము."

"చాలా పెద్ద పెద్ద మాటలు చెబుతున్నావు... తొందరపడి ఒక నిర్ణయానికి వస్తున్నావేమో?"

"కాదు శ్రీకాంత్ ... నైతిక విలువలు..."

"నైతిక విలువలు అంటే?"

"నైతిక విలువలు అంటే మోరల్ వాల్యూస్. ఎక్కడా కనిపించటం లేదు."

"ఎందుకని?"

"ఉదాహరణకి - మా తల్లి తండ్రులు..."

"మంచివాళ్లు."

"నేను అదే అనుకున్నా..."

"కాని?"

"ఒక్కొక్కసారి నాకు అనుమానం వేస్తుంది - వాళ్లకు పెళ్లైందా అని... ఎవరి ఇంటి పేరు వారిది - ఎవ్వరి బ్యాంకు అకౌంట్లు వారివి. ఎవరి సంపాదన వారిదే. ఉమ్మడి ఆలోచన, ఉమ్మడి బతుకు లేదు. శరీరపు కోరికలు తీర్చుకోవడానికి ఇద్దరు వ్యక్తులు చేసుకున్న ఒప్పందం లాగా కనిపిస్తుంది. ఇద్దరూ కలిసి ఉన్న ఫోటో కూడా ఇంట్లో లేదు. ఏమని అడుగుతే - సమాధానం శూన్యం! వాళ్లని భార్యాభర్తలని అనడానికి గుర్తు ఏది?"

"నువ్వే!..."

"భార్య భర్తల బంధం విడతీయడానికి వీలు లేదని, వారిద్దరు ఒకటే అని మన హైందవ సంస్కృతి చెప్పడం లేదా?"

"చెబుతోంది..."

"తనకు వివాహం అయిందని తెలుస్తే తనకు వచ్చే ఎలవెన్సులు, సౌకర్యాలు, టాక్స్ రిలీఫ్‌లు పోతాయని భయపడుతూ, ప్రభుత్వాన్ని, ప్రపంచాన్ని మోసం చేసి లాభం పొందే వ్యక్తులని ఎలా గౌరవించాలో తెలియడం లేదు. వివాహ బంధంలో ఉండే త్యాగం దీంట్లో ఏముంది? ప్రతిఫలం కోసం తాను అర్పించే సుఖం- వ్యభిచారమేగా! అటువంటి వారి నీడలో పెరిగిన బిడ్డలు - నీతిమంతులు, నిస్వార్థులు ఎలా అవుతారు?"

"సుందరీ! అది కాదు..."

"మొన్న ఒక పెళ్లికి వెళ్లాం. చాలా డబ్బు ఖర్చు పెట్టి వైభవంగా చేశారు. నగరంలో ధనవంతులు, పలుకుబడి కలవాళ్లు, రాజకీయ నాయకులు వచ్చారు. మగపెళ్లివారు పెళ్లికూతురుకు పెట్టిన నగలు, రవ్వల నెక్‌లెసే కాదు, వడ్డాణాలే కాదు - నువ్వు ఏ నగ పేరు చెబితే - ఆ నగ అక్కడ ఉంది.

"వర్ణాంతర వివాహం, ఆదర్శ వివాహం అంటూ రకరకాల పొగిడారు. ఆ పెండ్లి కొడుక్కు ఉన్న యోగ్యత అల్లా స్మగ్లింగ్ - బ్లాక్ మార్కెటింగ్, రిగ్గింగ్‌లో ప్రావీణ్యం, హత్యా రాజకీయాలు, ముఠా తగాదాలు. పెండ్లి కుమార్తె తండ్రి బోగస్

షేర్లు అమ్మేయడంలో సిద్ధహస్తుడు. వీరిని చాలా గొప్ప వ్యక్తులుగా, ఆదర్శ జీవులుగా పొగిడే సమాజం గొప్పదంటావా?"

"లోకం తీరే అంత! ధనవంతుడి దగ్గరే అన్ని మంచి గుణాలు కనిపిస్తాయి... టేకిట్ ఈజీ!"

"నీకేం అలాగే అంటావు.... నన్ను నీకు ఇచ్చి ఎందుకు పెళ్లిచెయ్యాలను కుంటున్నారో తెలుసా?"

"దీంట్లో తెలియడానికేముంది? నూట ఒక్క జిల్లాలకు అందగాడిని, యోగ్యుడిని, గుణవంతుడిని.... మా అమ్మగారికి ఒక్కడే కొడుకుని... అమెరికాలో మంచి ఉద్యోగంలో ఉన్నాను.

"ఆ ఆఖరి వాక్యం ఒక్కసారి చెప్పు."

"అమెరికాలో మంచి ఉద్యోగంలో ఉన్నాను."

"అదే మాకు కావల్సింది! ... నీకు పిల్లని ఇస్తే పురుడు పురుడుకి తను అమెరికా వస్తుందిట. మొదటి సారి అమెరికా వచ్చినప్పుడు అన్ని విషయాలు తెలుసుకోవచ్చునట. రెండవ సారి పురుడు లోపల నేను ఉద్యోగం చూసి గ్రీన్ కార్డ్ సంపాదించి - నాన్నకి, అమ్మకి అమెరికాలో స్థిర నివాసం ఏర్పాటు చేయాలిట. తరువాత నేను ఇక పిల్లలని కనకూడదట. ఇవి మా అమ్మ - వారి భర్త గారి ఆలోచనలు. కోట్లు సంపాదించాలంటె, లక్షలు పెట్టుబడి పెట్టాలిగా. అందుకనే మీ అమ్మగారు పెట్టిన షరతులన్నింటికి వాళ్లు ఒప్పుకుంటున్నారు."

"ఇప్పుడు అందరూ చేస్తున్న పనే ఇది."

"అందరూ చేస్తున్నారు కాబట్టి- తప్పు ఒప్పుగా మారదు. పిల్లల పెళ్లి పేరుతో తల్లి తండ్రులు కుమార్తెలని తార్చటం నేను సహించను."

"చాలా క్రూరంగా మాట్లాడుతున్నావు - మనం ఇవాళ ఈ స్థితిలో ఉన్నామంటే వాళ్లు ఎంత కష్టపడ్డారో - ఎన్ని త్యాగాలు చేశారో...."

"మిగతాది నన్ను చెప్పనీ. ఎన్ని అబద్దాలు ఆడారో. ఎన్ని తప్పు దోవలు తొక్కారో తలుచుకుంటే నా మీద, నా వాళ్లమీద చెప్పలేనంత అసహ్యం కలుగుతూంది."

"అసహ్యం కలుగుతోందని కూర్చుంటే కాదు. ఏదైనా మార్పు తీసుకు రావడానికి ప్రయత్నం చెయ్యి."

"ప్రయత్నం ప్రారంభించాను. దానిలో భాగంగానే నిన్ను ఇక్కడకు రమ్మని పిలిచింది. నేను నీతో కొన్ని ముఖ్య విషయాలు చెప్పదలుచుకున్నాను. అవి పూర్తిగా విను. నీకు నా షరతులు నచ్చితేనే మన ఇద్దరి వివాహం జరుగుతుంది."

"సావదానంగా ఉన్నాను. చెప్పు."

"మొదటిది నన్ను ఒక మనస్సున్న మనిషిగా గుర్తించి, ప్రేమించే వాడినే నేను పెళ్లి చేసుకోదలచుకున్నాను. నేను తెచ్చే కట్నకానుకల కోసం కాదు."

"రెండు. భర్తగా నన్ను మనసా, వాచా, కర్మణా భరించగలిగిన వాడికే నేను భార్యని కావాలని ఉంది."

"వివాహానంతరం నీది, నాది అనే మాట కాకుండా మనది, మన సంసారం అనే వ్యక్తి చేత మూడు ముళ్లూ వేయించుకోవాలని నా కోరిక."

"మాకు కలిగే సంతానం, మా ప్రేమకు ప్రతిఫలం కావాలి. కామానికి కాదు."

శ్రీకాంత్ బలవంతంగా నవ్వి - "సుందరీ! నువ్వు ఏదో ఉన్మాదంలో ఉన్నావు. నువ్వు త్రేతాయుగం నాటి మాటలు మాట్లాడుతున్నావు. సమాజం, కాలం మనల్ని శాసిస్తాయి. లొంగి ఉండాల్సిందే. మన అధికారాలూ అవీ ఉండవు. నీ ఆలోచనలోని నిజాయితీని నేను గౌరవిస్తాను. నీకు అన్ని విధాలా తగిన యోగ్యుడైన భర్తను ప్రసాదించవలసిందని భగవంతుడిని ప్రార్థిస్తాను" అని శ్రీకాంత్ అన్నాడు.

సుందరి అతని వంక చూసి "కోపం వచ్చిందా?" అని అడిగింది.

ఐస్‌క్రీమ్ కప్పు ఆ అమ్మాయి ముందు పెడుతూ, "నీ మీద గౌరవం పెరిగింది" అని అన్నాడు.

తరువాత నెలలో మూడు ముఖ్యమైన సంఘటనలు జరిగాయి.

సుందరీ వాళ్ల అమ్మగారు, వివాహం అయిన ఇరవై నాలుగు సంవత్సరాలకి- పుట్టినింటి పేరు వదిలి, మెట్టినింటి పేరును స్వీకరించి మొగుడితో కలిసి ఫోటో తీయించుకుంది.

శ్రీకాంత్ సకుటుంబంగా అనుకున్న రోజుకు అమెరికా తిరిగి వెళ్లాడు. భార్య పేరు - శకుంతల.

యోగ్యుడైన వరుడి కోసం సుందరి ఎదురు చూస్తోంది ఈ నాటికీ...!